క్లుప్తంగా

ఏపీఎంపై ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న రాకేష్, కమలహాసన్

కొత్తూరు: వెలుగు ఏపీఎం లలిత పలు అక్రమాలకు పాల్పడినట్లు స్థానిక ఎంపీడీఓ నీరజకు నివగాం గ్రామానికి చెందిన బి.రాకేష్, బి.కమలహాసన్ గురువారం ఫిర్యాదు చేశారు. మండల మహిళా సమాఖ్యకు ప్రభుత్వం నుంచి వివిధ పద్దుల కింద మంజూరైన నిధుల దుర్వినియోగం, అక్రమాలపై ప్రశ్నిస్తే ఏపీఎం తమపై తప్పుడు కేసులను పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏపీఎం విధులకు సమయపాలన పాటించడం లేదన్నారు. ఉల్లాస్ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. ఓడీఎఫ్ గ్రామాల్లో మరగుదొడ్లు నిర్మించిన లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తున్న రూ.పది వేలపై విచారణ చేపట్టాలన్నారు.

తగ్గుముఖం పట్టిన మహేంద్రతనయ



పాతపట్నం వద్ద మహేంద్రతనయ ప్రవాహం

పాతపట్నం: మహేంద్ర తనయనది ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ఉధృత్తంగా ప్రవహించింది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేపై నీరు పారడం గురువారం ఉదయానికి తగ్గింది. కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: మానవ జీవితం ఎంతో ఉన్నతమైనది, జీవితంలో వచ్చే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొవాలే తప్ప చావే పరిష్కారం కాదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా డిగ్రీ కళాశాలలో 'ఆత్మహత్యలు–కారణాలు, నివారణ' అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, కన్న తల్లిదండ్రులు గురించి ఒక్కసారి ఆలోచన చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్, అధ్యాపకుడు జి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన

బూర్జ: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. సంకల్ప యాత్రలో భాగంగా విద్యార్థినులకు పోక్సో చట్టం, మహిళల భద్రతపైన, భేటీ బచావో–భేటీ పడావో, మహిళలు, కిశోర్ బాలికల ఆరోగ్య భద్రతపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. బూర్జ పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళాశక్తి వృద్ధి చెందాలి

సరుబుజ్జిలి: మహిళలు అన్ని రంగాల్లో వృద్ధి చెందినప్పుడే సమాజం మరింత అభివృద్ధి బాటలో పయనిస్తోందని తహసీల్దార్ ఎల్.మధుసూదన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా సంకల్ప్ అన్న అంశంపై అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఆరోగ్యశాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ దైనందిన జీవన జీవనంలో ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గోవిందరావు, వైద్యాధికారి రఘువరన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.జానకిలక్ష్మి, జి.అమ్మన్నమ్మ పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



వక్తృత్వ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థినులు

హిరమండలం: వక్తృత్వ పోటీల్లో నలుగురు విద్యార్థినులు రాణించారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి వక్తృత్వ పోటీలు జరిగాయి. స్థానిక కేజీబీవీ పాఠశాలకు చెందిన పిండి యామిని, వాలిపిల్లి రూప విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పాణీపండా, నల్ల కీర్తన విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు మండలం నుంచి 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓలు రాంబాబు, దాలయ్య పర్యవేక్షించారు. క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్, స్థానిక హెచ్‌ఎం తూలుగు కేశవరావు ఏర్పాట్లు చేశారు.

విషసర్పాలతో జాగ్రత్త..!

- వర్షాలతో అన్నిచోట్లా పరుచుకున్న పచ్చదనం
- రాత్రివేళల్లో జాగ్రత్తలు తీసుకోవడం మంచిది
- వ్యవసాయ పనులు చేసే అన్నదాతలు మరిన్ని జాగ్రత్తలు పాటించాలి





పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు

హిరమండలం: వర్షాకాలం అన్ని ప్రాంతాలూ పచ్చదనంతో నిండాయి. బీడు భూములు, అటవీ ప్రాంతాల్లో కూడా మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనం పరచినట్లు కనిపిస్తోంది. దీంతో పాములు, విషపురుగులు విచ్చలవిడిగా సంచరిస్తుంటాయి. ఈ సమయంలోనే కుంటలు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డివాములు, పేర్చిన కట్టెలు, ఇటుకలు వంటి చోట్ల విషపురుగులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండేవారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విషపురుగులు, పాము కాటుకు గురయ్యే అవకాశం లేకపోలేదు.

ఆహారం కోసం బయటకు..

వర్షాకాలం కావడంతో ముఖ్యంగా కప్పలు ఎక్కువగా బయటకు వస్తుంటాయి. వాటితో పాటు బల్లులు, ఎలుకలు, తొండలను పాములు వేటాడుతుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాము కాటుతో ప్రాణాలమీదకు తెచ్చుకోవల్సిన పరిస్థితి వస్తోంది. జిల్లాలో ఎక్కువగా నాగుపాము, కట్లపాము, తాచుపాము, రక్తపింజర, పొడలు వంటి విషపూరిత పాములు సంచరిస్తుంటాయి. ఎవరైనా పాముకాటుకు గురైతే సరైన సమయానికి వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలపైకి వచ్చే అవకాశం ఉంది.

పాముకాటు ఇలా..

పాములకు చెవులు లేనప్పటికీ వాటి శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలు గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపంలోకి వచ్చినప్పుడు అవి వెంటనే వాటిని గుర్తించి కాటు వేస్తాయి. పాములు ఏకాంతానికి బంగం కలిగించినప్పుడు లేక ప్రాణభయం ఉన్నప్పుడు, ఎవరైనా అకస్మాత్తుగా తొక్కినప్పుడు మాత్రమే అవి కాటువేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళల్లో తిరిగే వారితో పాటు పొలాలు దగ్గర నిద్రించే రైతులు కూలీలు మాత్రం వెంట టార్చ్‌లైట్ ఉంచుకోవాలి. ఉన్న ప్రదేశాలను రోజూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పాములు కిరోసిన్, పెట్రోల్, డీజిల్ వంటి వాసన భరించలేవు. ఎక్కువగా ఉన్నచోట వీటిని ఉపయోగిస్తే మరీ మంచిది. రైతులు, కూలీలు రాత్రి వేళల్లో తిరిగేటప్పుడు కూడా మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు వేసుకోవడం ఉత్తమం. గడ్డిపని చేసేవారు రబ్బరు తొడుగులు వేసుకోవాలి. ఇళ్ల చుట్టుపక్కల పొదలు లేకుండా చూసుకోవాలి.

ప్రథమ చికిత్స ఇలా చేసుకోవాలి

- పాముకాటు వేసిన పైభాగంలో వెంటనే రక్త ప్రచరణ జరగకుండా తాడుతో కట్టాలి.
- పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. పక్కన వ్యక్తి ఉంటే బాధితుడుకు ధైర్యం చెప్పేందుకు ప్రయత్నం చేయాలి.
- కాటువేసిన పాము అంతక ముందు ఆహారం తిన్నా.. మరో జీవికి కాటువేసిన విషం తీవ్రత తక్కువగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- పాము కాటు వేసిన వ్యక్తికి ఎట్టి పరిస్థితిల్లోనూ ఆహారం ఇవ్వకూడదు. నడిపించడం, పరిగెత్తించం చేయకూడదు.
- నాటు మందులతో కాలయాపన చేయకుండా వెంటనే దగ్గరలో వైద్యశాలకు తరలించాలి.
- పాము కాటుకు గురైన వ్యక్తికి నిద్రపోకుండా చూసుకోవాలి.
- ఇలా చేయడం వల్ల ప్రమాదం నుంచి బయటపడేందుకు అవకాశం ఉందిని నిపుణులు తెలియజేస్తున్నారు

భయపడాల్సిన అవసరం లేదు



పాముకాటుకు గురైన వ్యక్తి భయపడాల్సిన అవసరం లేదు. ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకురావాలి. పాముకాటుకు గురైన వ్యక్తికి ధైర్యం కోల్పోకుండా చూసుకోవాలి. ఆసుపత్రికి చేరిన తరువాత విషయాన్ని వైద్యులకు తెలియజేయాలి. విషపూరిత పాముకాటు వేసినట్లు నిర్ధారించుకున్న తరువాతనే విరుగుడు మందును ఇవ్వడం జరుగుతంది. ప్రస్తుతం సీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నాయి.

– పి.ప్రియాంక, వైద్యాధికారి, ఎల్‌ఎన్‌పేట పీహెచ్‌సీ

పూర్తిస్థాయిలో ఎరువులు అందిస్తాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రైల్వే స్టేషన్ వద్ద యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆమదాలవలస: జిల్లాలోని రైతులందరికీ పూర్తిస్థాయిలో ఎరువులు అందిస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ఎరువుల దుకాణాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణం వద్ద ఉన్న రైతులతో ఎరువుల లభ్యతపై మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన మేరకు ఎకరాకు 25 కేజీల చొప్పున యూరియా వేస్తే సరిపోతుందన్నారు. జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఎరువులు పక్కదారి పడితే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ గూడ్స్ గోడౌన్ వద్దకు చేరుకొని ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని ఏఓ మెట్ట మోహన్‌రావును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే కోరమండల్, తదితర కంపెనీ ప్రతినిధులతో ఫోన్లో కలెక్టర్ మాట్లాడారు. ఎరువులను ఇక నుంచి పూర్తిస్థాయిలో పంపించాలన్నారు. రైల్వే గూడ్స్ యార్డ్ వద్ద నిల్వ చేయటానికి గిడంగుల సదుపాయం లేదని, హమాలీల కొరత కూడా ఉందని యూరియా కంపెనీ ప్రతినిధి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి ఇబ్బందులు లేకుండా తాను చూసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు, ఎంపీడీఓ ఆర్.వెంకటరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: యూరియా పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో గురువారం విలేకర్లతో మాట్లాడారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. రైతు సమస్యలపై సీఎం చంద్రబాబు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు కొంతమందికే అందాయన్నారు. కొత్తూరు మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేస్తామంటున్న పలాస జిల్లాలో కలపవద్దన్నారు. కొత్తూరు మండలాన్ని టెక్కలి డివిజన్ నుంచి శ్రీకాకుళం డివిజన్‌లో విలీనం చేయాలని కోరారు. సర్పంచ్ ధర్మారావు రంజిత్, పార్టీ నాయకులు అగతమూడి నాగేశ్వరరావు, రాఘవ, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



సారవకోట: మాట్లాడుతున్న ఎంఈఓ రమణ



పాతపట్నం: అండర్–14 చెస్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సారవకోట: విద్యార్థులు ఆటల్లో రాణించాలని ఎంఈఓ ఎం.వి.రమణ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్ అండర్ 14, అండర్ 17 వయస్సు గల పిల్లలకు నిర్వహించారు. ఎంఈఓ 2 భూలక్ష్మి, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సత్యారావు, రామరాజు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు 89 మంది ఎంపిక..

హిరమండలం: మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. కల్లట కార్మెల్ పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. మండల విద్యాశాఖ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీలకు మండలంలోని 12 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 350 మంది హాజరయ్యారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో ఆరు రకాల క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, కబడ్డీ తదితర విభాగాల్లో జరిగిన పోటీల్లో 89 మంది విద్యార్థులు ప్రతిభచూపారు. డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇక్కడ సత్తాచాటేవారు జిల్లా జట్టుకు ఎంపికకానున్నారు. విద్యార్థులకు ఎంఈవోలు రాంబాబు, దాలయ్య అభినందనలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల కోఆర్డినేటర్ రమేష్, పీఈటీలు ధర్మారావు, సుజాత, జ్యోతి, రాజశేఖర్, యతీష్, అబ్బాయి, అప్పారావు, నవీన్, ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

పాతపట్నం: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక వికాశం కలుగుతుందని ఎంఈఓలు ఎ.గోవిందరావు, సి.హెచ్.తిరుమలరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అథ్లెటిక్స్, చెస్, యోగా, తదితర క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను డివిజన్ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని పీడీ వై.శేఖర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

పొందూరు: మండలంలోని లోలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి క్రీడాకారులు ఎంపిక పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17 విభాగాల్లో నాలుగు క్రీడాంశాల్లో ఎంపికలు పూర్తి చేశారు. ఎంఈవో–1, 2లు వాగ్దేవి, రాజారావు ఈ పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్ పోటీలకు 11 పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్ డి.ఉదయ్‌కుమార్, పీడీలు పెంటయ్య, బాబూరావు, యుగంధర్, శ్రీనివాస్, తదితరులు క్రీడలను నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: ఏపీఎస్ ఆర్టీసీలో శిక్షణ కోసం ఎస్సీ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాదరావు గురువారం తెలిపారు. ఆర్టీసీలో శిక్షణనిచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన వారు అర్హులన్నారు. ఒక సచివాలయం పరిధిలో ఇద్దరు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ అనంతరం ఆర్టీసీలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మండల సమావేశం

నరసన్నపేట: ఈ నెల 12వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకటేశ్వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన ఉదయం పది గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

పొందూరు: పొందూరు పంచాయతీ పరిధిలోని జోగన్నపేట సమీపంలో పొందూరు పీఏసీఎస్‌కు చెందిన స్థల వివాదాన్ని రెవెన్యూ, పోలీసులు, డీసీసీబీ అధికారుల సమక్షంలో పరిష్కరించారు. మూడు నెలల క్రితం పీఏసీఎస్ అధికారులు శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటేష్, డీసీసీబీ సీఈఓ డి.సత్యనారాయణ, పోలీసుల సమక్షంలో గురువారం సమస్యను పరిష్కరించారు.

నిబంధనలు తప్పనిసరి

హిరమండలం: గ్రామ పంచాయతీల రికార్డుల నిర్వహణలో నిబంధనలు పాటించాలని ఆడిటర్ ప్రసన్నకుమార్ అన్నారు. ఎల్.ఎన్.పేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎటువంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఉండేందుకు సక్రమంగా వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామ పంచాయతీకి వచ్చిన ఖర్చులు, ఆదాయాలకు సబంధించిన రికార్డుల నిర్వహణ సంక్రమంగా ఉండాలన్నారు. ఆడిట్ చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. పంచాయతీ కార్యదర్శుల సందేహాలను నివృత్తి చేశారు.

క్వారీ యజమానుల దౌర్జన్యం..!

- దళిత, బీసీ రైతులకు పొలాల్లోకి వెళ్లకుండా అడ్డగింత

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామ పంచాయతీ పరిధిలో గల సర్వే నంబర్–1లో ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లకుండా క్వారీ యజమానులు అడ్డుకోవడం సమంజసం కాదని గ్రామానికి చెందిన దళితులు ఆరోపిస్తున్నారు. గురువారం తమను అడ్డుకోని అక్కడ ఉన్న క్వారీ రోడ్డుకు గండి కొట్టడంతో సాగు భూముల్లో కూడా వెళ్లలేక పోయామని ఎస్సీ, బీసీ రైతులు ఆవేదన వ్యక్తం చేసి నిరసన చేశారు. దీనిపై గ్రామ సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వెళ్లి పరిశీలించారు.



దళితులు, బీసీలు సాగు చేస్తున్న భూములను పరిశీలిస్తున్న సిబ్బంది

చంద్రబాబుది దారుణ వంచన

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: సూపర్ సిక్స్ పేరిట రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు దారుణంగా వంచించారని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ ముఖం పెట్టుకొని సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. ప్రజలకు సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలు ఇచ్చిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. హామీలన్నింటినీ గాలికొదిలేసి విజయోత్సవ సభలు పెట్టుకోవడం హాస్యాస్పదమన్నారు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎటు వెళ్లిపోయాయని ప్రశ్నించారు. బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ అందిస్తామన్నది మీరు కాదా అంటూ నిలదీశారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండో ఏడాదిలోకి పాలనలో వచ్చినా ఇంత వరకు ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడం దారుణమన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి నెలకు రూ.1500 ఇస్తామన్న ప్రధాన హామీని పక్కన పడేశారని విమర్శించారు. కూటమి కార్యకర్తలే సంక్షేమ పథకాలు ఇచ్చి, అందరికీ అందిజేసినట్లు ప్రకటించి విజయోత్సవాల పేరిట ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, మీ మాటలను నమ్మే స్థితిలో లేరన్నారు.

కృతజ్ఞతలు..



సారవకోట: జన్ని అనిరుద్రుడు



సారవకోట: గెల్లంకి వెంకటరావు



నరసన్నపేట: లోకనాథ శర్మ

సారవకోట: మండంలోని పాతూరు గ్రామానికి చెందిన జన్ని అనిరుద్రుడిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా పార్టీ అధిష్టానం నియమించింది. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సంయుక్త కార్యదర్శిగా గెల్లంకి వెంకటరావును నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచారం విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శర్మ

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నరసన్నపేట పంచాయతీ వార్డు సభ్యులు బంకుపల్లి లోకనాథ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ఈ పార్టీ పదవి కల్పించారని, బాధ్యతగా పనిచేస్తానన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు.

అభినందనలు..



ఆమదాలవలస: తమ్మినేని సీతారాంను కలిసిన గుమ్మడి రాంబాబు, నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇటీవల గుమ్మడి రాంబాబును పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. గురువారం మాజీ స్పీకర్, రాష్ట్ర రాజకీయాల వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని ఆయన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గుమ్మడికి తమ్మినేని అభినందలు తెలియజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. బూర్జ మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి!

- పీఎంపీ నిర్వాకం
- ఆందోళనకు దిగిన బంధువులు



శ్రీసాయి ప్రజా వైద్యశాలలో మృతి చెందిన కిల్లారి తేజాలు



సీజ్ చేసిన వైద్యశాల వద్ద అధికారులు

కొత్తూరు: భామిని మండలంలోని ఘనసర గ్రామానికి చెందిన కిల్లారి తేజాలు(58) కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీసాయి ప్రజావైద్యశాలలో వైద్యం పొందుతూ మృతి చెందింది. తేజాలు మృతికి పీఎంపీ వై.నాగేశ్వరరావు నిర్లక్ష్యమే కారణమని బంధువులు ప్రజా వైద్యశాల ముందు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. తేజాలు కాళ్లు, చేతులు పీకుతున్నాయని భర్త తవిటినాయుడుతో కలిసి శ్రీసాయి ప్రజా వైద్యశాలకు గురువారం వెళ్లింది. అక్కడ పీఎంపీ నాగేశ్వరరావు రెండు ఇంజక్షన్లు వేసే సమయానికి తేజాలు అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందిందని భర్త తెలిపారు. తేజాలు బంధులు ప్రజా వైద్యశాల వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ అక్కడకు చేరుకొని మృతురాలి బంధువులను శాంతింపజేశారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపీ నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఆస్పత్రికి తరలించారు.

శ్రీసాయి ప్రజా వైద్యశాల సీజ్..

మహిళ మృతి చెందిన ఘటనలో శ్రీసత్య సాయి ప్రజా వైద్యశాల, లక్ష్మీ వెంకటేశ్వర మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌ను అధికారులు గురువారం రాత్రి సీజ్ చేశారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ బాలకృష్ణ సమక్షంలో సీజ్ చేసినట్లు కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్ తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన



సరుబుజ్జిలి: రొట్టవలస హైస్కూల్ ఆవరణలో నిరసన తెలుతున్న ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సీపాన రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు అందించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీని నియాకం చేయాలని, అసైన్‌మెంట్ బుక్‌లెట్ విధానం రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి..

ఆమదాలవలస: ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అకాడమిక్ మెంబర్ పంది మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్ 257) పిలుపుమేరకు గురువారం ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి రామస్వామి నాయుడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ షావలి, శివరాజ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. నిరసనలో హెచ్‌ఎం కె.ఎ.రాములు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు